## క్లుప్తంగా

### జాబ్ మేళాలో 34 మంది ఎంపిక



అనుమతి పత్రాలతో యువతీ, యువకులు

ఆలూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో శనివారం నిర్వహించిన జాబ్ మేళాకు 88 మంది నిరుద్యోగ యువతీ, యువకులు హాజరయ్యారు. శ్రీరామ్ చిట్స్ అండ్ ఇన్సూరెన్స్, యంగ్ ఇండియా ప్రతినిధులు తమ సంస్థల్లో పలు పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా 34 మందిని ఆయా కంపెనీల హెచ్ఆర్‌లు ఎంపిక చేసుకొని అనుమతి పత్రాలను అందజేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, స్కిల్ ప్లేస్‌మెంట్ ఆలూరు ఏరియా కో–ఆర్డినేటర్ వీరేష్ ఉన్నారు.

### అక్రమ నిర్మాణాల కూల్చివేత



పెండేకల్లు రైల్వే జంక్షన్‌లో ఇళ్లు కూల్చివేస్తున్న దృశ్యం

తుగ్గలి : మండలంలోని పెండేకల్లు రైల్వే జంక్షన్‌లో అక్రమ నిర్మాణాలను శనివారం రైల్వే అధికారులు కూల్చివేయించారు. రైల్వే స్థలంలో కొన్నేళ్ల క్రితం పలు కుటుంబాలు ఇళ్లు నిర్మించుకుని నివాసముంటున్నాయి. ఇప్పుడు డబుల్ లైన్ పనులు ప్రారంభం కావడంతో వారం క్రితం రైల్వే అధికారులు ఖాళీ చేయాలని ఇంటి యజమానులకు నోటీసులు ఇచ్చారక మేరకు జాలవాడి సునీత, ఆదిలక్ష్మి, అంజలి, నాగలక్ష్మికి చెందిన ఇళ్లు పూర్తిగా కూల్చి వేయగా మరో ఐదు ఇళ్లు కొంత మేర కూల్చివేతలో పోయాయి. ఇళ్లు కూల్చివేతతో ఆ కుటుంబాలు రోడ్డున పడ్డాయి.

### ప్రత్యేక పూజలు

ఆస్పరి: మండలంలో హలిగేర గ్రామ సమీపంలోని కొండల్లో వెలసిన కూర్మ నారాయణ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి గంగ పూజ, మంగళహారతులు తదితర పూజలు చేపట్టారు. కార్తీక మాసం ప్రారంభం కావడంతో స్వామి వారిని దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

### ఆర్థిక బకాయిలు చెల్లించాలి

మద్దికెర : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించి అపార్ ఐడీలను సృష్టించడంలో సమస్యలను పరిష్కారించాలని యూటీఎఫ్ జిల్లా ఆర్థిక కార్యదర్శి యోహోషువా డిమాండ్ చేశారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. 12వ పీఆర్‌సీ ఏర్పాటు చేసి ఐఆర్‌ను ప్రకటించాలన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా రంగన్న, ప్రధాన కార్యదర్శిగా అరుణ్, ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నాగరాజు, విశ్వనాథ్, జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

### వైభవంగా బ్రహ్మోత్సవాలు



హుల్తిలింగేశ్వర, కారుమంచేశ్వరస్వాములు

పత్తికొండ(తుగ్గలి) : మండలంలోని పెద్ద హుల్తిలో వెలసిన హుల్తి లింగేశ్వర, కారుమంచేశ్వరస్వాముల బ్రహోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. శనివారం స్వాముల వారికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి మందపూజ, ఊరేగింపు చేపట్టారు. ఉత్సవాలను తిలకించేందుకు కర్ణాటకతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో గ్రామం కిక్కిరిసిపోయింది. ఆదివారం వేకువజామున గంగపూజ అనంతరం స్వామి కాలి ఆట ప్రధాన ఘట్టాలను చూసేందుకు భక్తులు తరలిరానున్నారు.

### చిన్నారులకు సాయం



చిన్నారులకు నగదు, దుస్తులు అందజేస్తున్న దాతలు

పత్తికొండ(తుగ్గలి) : తల్లిదండ్రుల మృతితో అనాథలుగా మిగిలిపోయిన చందోలికి చెందిన ముగ్గురు చిన్నారులను ఆదుకునేందుకు దాతలు స్పందిస్తున్నారు. శనివారం బుడగ జంగాల వెంకటేష్, జయన్న, చందోలి సలీంబాషా రూ.25వేల నగదు, దుస్తులను చిన్నారులకు అందజేశారు. గ్రామ పెద్దలు ముత్యాల జయన్న, ఈశ్వరయ్య, మాజీ సర్పంచ్ రంగప్ప, తలారి మాదప్ప, గోవర్ధన్ పాల్గొన్నారు.

**మాజీ సర్పంచ్ మృతి**

ఆస్పరి: మండలంలోని కారుమంచి మాజీ సర్పంచ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మురళీధర్‌రెడ్డి మాతృమూర్తి కాపరెడ్డి రత్నమ్మ (97) అనారోగ్యంతో శనివారం మృతి చెందింది. ఈమెకు ముగ్గురు కుమారులు ఉన్నారు. ఈమె మృతి పట్ల సర్పంచ్ లక్ష్మీ, వైస్ ఎంపీపీ చంద్రకళ, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# బడి.. సమస్యల ఒడి

- దుర్భరంగా మార్లమడికి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల
- పెచ్చులూడి పడుతున్న తరగతి గదులు
- ప్రహరీ లేక విష పురుగులు, పశువులు, పందుల సంచారం
- 'మధ్యాహ్నం' వేళ మంచినీరూ కరువే



శిథిలావస్థకు చేరిన మార్లమడికి పాఠశాల



పెచ్చులూడిన తరగతి గదిలో ఇనుప కడ్డీల పక్కన తరగతి నిర్వహిస్తున్న దృశ్యం



సిమెంట్ పెచ్చులూడి ఇనుప కడ్డీలు తేలిన దృశ్యం

హొళగుంద: అది కర్ణాటక సరిహద్దులో ఉన్న మార్లమడికి గ్రామం.. మండల కేంద్రానికి మారుమూల గ్రామం కావడం.. అభివృద్ధికి దూరంగా పూర్తిగి వెనుకబడి పోయింది. గ్రామంలో ప్రభుత్వ పాఠశాల కూడా అంతే వెనుకబడి ఉంది. గతంలో నాడు–నేడు కింద ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు. 112 మంది విద్యార్థులు ఉన్న ఈ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ముందు, వెనుక భాగం, తరగతి గదులు శిథిలమవడంతో సిమెంట్ పెచ్చులు ఊడి కడ్డీలు తేలాయి. ఎప్పుడు కూలుతుందోననే భయంతో ఉపాధ్యాయులు దగ్గర్లోనున్న ఆర్డీటీ భవనంలో కొన్ని తరగతులు నిర్వహిస్తోన్నరు. మిగిలిన చిన్న పిల్లలకు ప్రమాదకరంగా ఉన్న గదుల్లోనే చదువులు చెబుతున్నారు. ఇక ప్రహరీ లేకపోవడంతో పశువులు, పందులు సంచరిస్తుంటాయి. ఇక విషపురుగులు తిరుగుతుండటంతో గదుల్లోంచి చిన్నారులు బయటకు రావడానికి జంకుతున్నారు. పాఠశాల పరిసరాల్లో చెత్త కుప్పలు, మురుగు నీరు నిల్వ ఉండిపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. తాగునీటి వసతి లేకపోవడంతో మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



మార్లమడికి ప్రైమరీ పాఠశాల సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. డీఈఓ, కలెక్టర్, ఆదోని సబ్ కలెక్టర్ తదితర ఉన్నతాధికారులకు నివేదికలు కూడా పంపించాం. ప్రస్తుతం ప్రహరీ, మరుగుదొడ్లు తదితర కొన్ని అభివృద్ధి పనులు మొదలై ఆగిపోయాయి. తరగతి గదులు అంత ప్రమాదకరంగా లేవు. అయినా గదులు, ఇతర పనులు చేపట్టాలని ఉన్నతాదికారులను కోరాం.

– సత్యనారాయణ, ఎంఈఓ–2, హొళగుంద

ప్రస్తుతం ఉన్న భవనం పక్కనే నాడు–నేడు కింద అదనపు తరగతి గదులు నిర్మించడానికి స్థలాన్ని గుర్తించినా పనులు మొదలు పెట్టలేదు. ఏళ్లు గడుస్తున్నా పాఠశాల అభివృద్ధికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇక మరుగుదొడ్లు, బాత్ రూంలు అంతంత మాత్రమే. అధికారులు, పాలకులు స్పందించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని గ్రామస్తులు, విద్యార్థుల తల్లిండ్రులు కోరుతున్నారు.

### తాగునీటి సమస్య వేధిస్తోంది



తాగునీటి సమస్య తీవ్రంగా వేదిస్తోంది. భోజన సమయంలో నీరు లేక విద్యార్థులు బాటిళ్లు తెచ్చుకుంటున్నారు. కుళాయిలు, బోరు నీళ్లు సరిగా లేకపోయినా వాటినే తాగుతున్నారు. చాలా రోజులు నుంచి సమస్య ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. పాఠశాల ముందు ఆడుకోవడానికి గ్రౌండ్ లేదు. ఉన్న కొద్ది పాటి స్థలం, పక్కనే డ్రైనేజీ ప్రమాదకరంగా ఉంది. పాఠశాల సమస్యలను తీర్చాలి.

– దేవేంద్ర, మార్లమడికి

### కొత్త భవనం, ప్రహరీ నిర్మించాలి



పాఠశాలకు కొత్త భవనం, కాంపౌండ్ నిర్మించాలి. తరగతి గదుల్లో పెచ్చులు ఊడి పడుతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియటం లేదు. ప్రహరీ లేక పోవడంతో భోజన సమయంలో పందులు, పశువులు తిరుగుతూ ఇబ్బంది కలిగిస్తున్నాయి. విషపురుగులు వస్తుండటంతో పిల్లలు ఆటలాడేందుకు భయపడుతున్నారు. పక్కనే బళ్లారి ప్రధాన రోడ్డు ఉండడం వల్ల విద్యార్థులు అదమరిచి అటువైపు వెళ్తే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది.

– ఎర్రిస్వామి, మార్లమడికి

## కార్తీకమాస పూజలు ప్రారంభం



పత్తికొండ బైపాస్ రోడ్డులోని శివాలయంలో దీపాలు వెలిగించిన భక్తులు

పత్తికొండ(తుగ్గలి) : పత్తికొండ మండలం మండగిరిలో ప్రాచీన రామలింగేశ్వరస్వామి, పట్టణంలోని బైపాస్‌లో రోడ్డు పక్కనున్న శివాలయాల్లో కార్తీక మాస పూజలు నిర్వహించారు. శనివారం వేకువజాము నుంచే భక్తులు శివుడికి రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు చేపట్టారు. దీపాలు వెలిగించి పూజలు చేశారు.

**శివ,కేశవులకు ప్రీతిపాత్రం..**

పవిత్ర కార్తీక మాసం ప్రారంభమైంది. శివకేశవులకు ప్రీతికరమైన ఈ మాసం ఆధ్యాత్మికంగా ప్రాధాన్యత సంతరించుకుంది. గోస్పాదమంత నీటిలో కూడా శ్రీమన్నారాయణుడు ఉంటాడని పురాణాలు వివరిస్తున్నాయి. అందుకే ఈ మాసంలో చన్నీటి స్నానానికి విశేష ప్రాధాన్యత ఉంది. నిత్య దీపారాధన, మారేడు దళాలతో, తుమ్మి పూలతో శివాలయాల్లో పూజలు నిత్యకృత్యం. కార్తీక సోమవారాల ఉపవాసాలు విశేష పుణ్యఫలాన్నిస్తాయి. కార్తీక మాసంలో సోమవారానికి పెద్దపీట ఉంది. ఆ రోజు శైవాలయాలు భక్తులు కిటకిటలాడతాయి. ఈ మాసంలో కేదారేశ్వర వ్రతం, సత్యనారాయణ స్వామి వ్రతం, వన భోజనాలు, బ్రాహ్మణులకు సంతర్పణలు, దానాలు చేస్తారు. శివునికి చేసే రుద్రాభిషేకం వల్ల అనంతమైన శుభాలు సంప్రాప్తిస్తాయని శివపురాణం చెబుతోంది. కార్తీక మాసంలో భక్తజన కోటి నియమనిష్ఠలతో, పూజా పునస్కారాలతో గడుపుతారు. కార్తీక శుద్ధ ద్వాదశికి కూడా ప్రత్యేక స్థానముంది. ఆరోజున సకల దేవతలు తులసీ వనంలో జీవిస్తారని, ఆరోజు చేసే తులసీ పూజ వల్ల ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు కలుగుతాయని భక్తుల నమ్మకం.

**రంగనాథ స్వామి ఆలయంలో..**



ప్రత్యేక అలంకరణలో రంగనాథ స్వామి

మద్దికెర : మండలంలోని మద్దికెర, పెరవలి గ్రామాల్లో శనివారం కార్తీకమాస పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా శ్రీరంగనాథస్వామి దేవాలయంలో స్వామి వారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం బిందె సేవ, అష్టోత్తరనామార్చన, మంగళహారతి ఇచ్చారు. ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి ఆలయ చుట్టూ ప్రదక్షిణ చేయించారు. సాయంత్రం పురవీధుల్లో పల్లకీ సేవ జరిపించారు. అలాగే స్థానిక గిడ్డాంజనేయ స్వామి దేవాలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టారు.

## నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ వీరభద్రప్ప

మద్దికెర : గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని డీఎల్‌పీఓ వీరభద్రప్ప అన్నారు. శనివారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఈఓల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో బోర్లు, కుళాయిలు చెడిపోతే వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజలకు నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండేటట్లు చూడాల్సిన అధికారులపై ఉందన్నారు. పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను ఇంటింటికీ వెళ్లి సేకరించి చెత్త సంపద కేంద్రాలకు తరలిస్తే.. అక్కడి సిబ్బంది ఎరువు తయారు చేయాలని చెప్పారు. పంచాయతీలలో పన్నులు సక్రమంగా వసూలు చేసి గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. సర్పంచ్ బండారు సుహాసిని, ఈఓలు శివ, సుధాకర్, సచివాలయ కార్యదర్శులు అరుణకుమారి, రేణుక, మంజునాథ్ పాల్గొన్నారు.

## ●ఆదమరిస్తే.. వాగులోకే!

హాలహర్వి: మండలంలోని విరుపాపురం గ్రామ సమీపంలోని జెడ్పీ ఉన్నత కన్నడ పాఠశాల సమీపంలోనున్న వాగుపై నిర్మించిన వంతెనకు ఇరువైపులా రక్షణ గోడలు ఏర్పాటు చేయలేదు. దీంతో ఆలూరు నుంచి హొళగుందకు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందికరంగా ఉంది. ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా వాగులోకి వాహనం పడిపోయే ప్రమాదం ఉంది. సంబంధిత అధికారులు సైడ్ వాల్స్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



రక్షణ గోడ లేకుండా ప్రమాదకరంగా వంతెన

## ●గుండె గు'బిల్లు'





చిన్న ఇంటికి కరెంట్ బిల్ ఎక్కువ వచ్చిందని చెబుతున్న రహంతుల్లా

హొళగుంద: స్థానిక ఈబీసీ కాలనీకి చెందిన మెకానిక్ రహంతుల్లా ఉండే చిన్న ఇంటికి రూ.1,119 కరెంట్ బిల్లు వచ్చింది. గతంలో రూ.500 వరకు బిల్లు వచ్చేదని, నాలుగు నెలలుగా కొద్ది కొద్దిగా పెరుగుతూ ఈ నెల ఏకంగా రూ.1,119 బిల్లు రావడంతో కుటుంభ సభ్యులు లబోదిబోమంటున్నారు. ఇల్లు తప్ప తమకు ఎలాంటి ఆస్తులు లేని, మెకానిక్ పని చేసుకుంటూ తన భార్య, నలుగురు పిల్లలతో కుటుంబాన్ని పోషించుకుంటున్నానని రహంతుల్లా వాపోయాడు. రెండు ఫ్యాన్లు ఉన్నా ఎండాకాలంలో మాత్రమే ఒకు ఫ్యాన్ వాడుతామని, రెండు లైట్లు మాత్రమే వాడతామని చెప్పారు. వీటికే ఇంత బిల్లు వస్తే తాము ఎలా జీవించాలని ఆవేదన వ్యక్తం చేశాడు. ఇప్పటికే నిత్యావసర సరుకులు ధరలు పెరిగి అల్లాడుతుంటే కరెంట్ బిల్లు షాక్ ఇస్తోందన్నాడు. బిల్లు విషయాన్ని విద్యుత్ శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని చెప్పాడు.

### సీసీ రోడ్డు పనులు ప్రారంభం

హొళగుంద: సీసీ రోడ్డు లేక వర్షాకాలంలో ఇబ్బందులు పడుతున్న స్థానిక రాజానగర్ కాలనీలోని మాబుసుబాని దర్గా ముందు రోడ్డులో సీసీ రోడ్డు నిర్మాణం పనులను నూర్‌బాషా దూదేకుల సంఘం నాయకులు ప్రారంభించారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రూ.5 లక్షలతో వంద మీటర్ల వరకు సీసీ రోడ్డు వేస్తున్నట్లు నాయకులు హుసేన్‌పీరా, సులేమన్, చిన్న హుసేన్‌పీర్, బడేసాబ్, సాయిబేష్, వన్నూరుసాబ్ తెలిపారు. శనివారం రోడ్డు చదును, గ్రావెల్ పనులు చేపట్టారు.

### జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

దేవనకొండ: అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) కర్నూలు జిల్లా 30వ మహాసభలు ఈనెల 12, 13వ తేదీల్లో ఆదోని పట్టణంలో జరగనున్నాయని, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.శరత్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని భ్రష్టు పట్టిస్తున్నాయని మండిపడ్డారు. మధు, భాస్కర్, చరణ్, బాలరాజు, భరత్ పాల్గొన్నారు.

### సమస్యల పరిష్కారానికి పోరుబాట

ఆస్పరి: నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేష్ అన్నారు. శనివారం మండలంలోని కైరుప్పల గ్రామంలో డీవైఎఫ్ఐ 44వ అవిర్భావ దినోత్సవం జరుపుకున్నారు. ఈ సందర్భంగా జెండాను అవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 5నెలలు కావస్తున్నా నిరుద్యోగ భృతి ఇవ్వలేదన్నారు. సీపీఎం నాయకుడు బాలకృష్ణ, డీవైఎఫ్ఐ నాయకులు నాగార్జున, సుధాకర్, ప్రకాష్, బద్రి, ఓబులేషు, జయరాం, రమేష్ పాల్గొన్నారు.

### భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు



చెరుకులపాడు సచివాలయంలో రీ సర్వే గ్రామసభ నిర్వహిస్తున్న అధికారులు

వెల్దుర్తి(కృష్ణగిరి): భూ సమస్యల పరిష్కారం కోసమే గ్రామసభలు చేపట్టినట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మ తెలిపారు. మండలంలోని చెరుకులపాడు గ్రామంలో శనివారం నిర్వహించిన రీ సర్వే గ్రామసభలో ఆయన పాల్గొని రైతుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ రీ సర్వే జరిగిన భూములకు సంబంధించి అడంగల్ ఎంట్రీలో పొరపాట్లు, కొలతలు, విస్తీర్ణంలో తేడాలు ఉన్నట్లు గుర్తించిన రైతులు తమ సమస్యలను గ్రామసభ దృష్టికి తీసుకరావాలని సూచించారు. ఫిర్యాదులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ హేమంత్‌రెడ్డి, వీఆర్వో బీవీ రమణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## సర్వసభ్య సమావేశం బహిష్కరణ

- ఆర్‌అండ్‌బీ అధికారుల గైర్హాజరుపై సభ్యుల ఆగ్రహం
- ధణాపురం రోడ్డును బాగు చేయాలని డిమాండ్



రోడ్డుపై నిరసన తెలుపుతున్న ఎంపీపీ, ఎంపీటీసీలు



ఆర్‌అండ్‌బీ అధికారుల గైర్హాజరుపై ఎంపీడీఓను ప్రశ్నిస్తున్న ఎంపీటీసీలు

హొళగుంద: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీటీసీలు బహిష్కరించారు. సమావేశాన్ని నిర్వహించడానికి ఎంపీడీఓ విజయలలిత సిద్ధమవుతుండగా ఇంగళదహాళ్ ఎంపీటీసీ మల్లికార్జున, కెంచప్ప, ఉరుకుందప్ప, శివన్న, సంధ్యాబాయి, శేఖన్‌బీ, లక్ష్మీకాంతరెడ్డి, సర్పంచ్‌లు వెంకటరెడ్డి, వెంకట్రామిరెడ్డి తదితరులు ఆర్‌అండ్‌బీ శాఖ అధికారుల గైర్హాజరుపై ఆగ్రహం వ్యక్తం చేసారు. హొళగుంద–ధణాపురం రోడ్డు పూర్తి అధ్వాన స్థితికి చేరిందని దీనిపై అధికారులను అడుగుదామంటే వారు సమావేశానికి రాలేదని, దీంతో వారికి విధుల పట్ల ఎంత అంకిత భావముందో అర్థమవుతుందని మండిపడ్డారు. వారొస్తేనే సమావేశానికి హాజరవుతామని చెప్పిన ఎంపీటీసీలు, ఎంపీపీ తంబాకు నూర్జహాన్‌బీ, వైస్ ఎంపీపీ గాదెమ్మ సమావేశాన్ని బహిష్కరించి బయటకెళ్లిపోయారు. అనంతరం ఆదోని రోడ్డుపై, అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ మల్లికార్జున తదితరులు మాట్లాడుతూ గతంలో హొళగుంద–ధణాపురం రోడ్డు మరమ్మతుకు నిధులు మంజూరై కొన్ని కారణాల వల్ల పనులు ఆగిపోయాయన్నారు. అయితే దెబ్బతిన్న రోడ్ల మరమ్మతు కోసం ప్రభుత్వం రూ.847 కోట్లు కేటాయించిందని, అయితే అందులో హొళగుంద–ధణాపురం రోడ్డును చేర్చలేదన్నారు. ప్రస్తుతం ఆదోని రోడ్డు దారుణంగా తయారైందని ఆవేదన వ్యక్తం ఏశారు. వెంటనే హొళగుంద–ధణాపురం రోడ్డుతో పాటు గజ్జహళ్లి–పెద్దహరివాణం క్రాస్ రోడ్డును బాగు చేయాలని డిమాండ్ చేశారు.

## మహిళల మధ్య 'మధ్యాహ్నం' రగడ



మోడల్ స్కూల్‌లో వాగ్వాదం చేసుకుంటున్న మహిళలు

ఆలూరు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వంట ఏజెన్సీల నిర్వాహకుల తొలగింపు కొనసాగుతోంది. ఇందులో భాగంగా శనివారం ఎల్లార్తి రోడ్డు సమీపంలో ఉన్న మోడల్ స్కూల్‌లో 2016 నుంచి భాగ్యమ్మ పొదుపు గ్రూపు సభ్యులు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండి వడ్డిస్తున్నారు. అయితే వారిని తొలగిస్తున్నట్లు పేర్కొనడంతో.. నోటీసులు ఇవ్వకుండా ఎలా తొలగిస్తారని నిర్వాహకులు ప్రశ్నించారు. నూతనంగా వంట చేసేందుకు వచ్చిన గ్రూప్ సభ్యులతో వాగ్వాదానికి దిగారు. పీఎంసీ చైర్మెన్ విశ్వేశ్వరయ్యస్వామి, వైస్ చైర్మెన్ లక్ష్మీ తమను తొలగించేందుకు కుట్ర చేస్తున్నామని భాగ్యలక్ష్మీ ఆరోపించారు. తాము సొంతంగా వంట చేస్తామని రాలేదని తమకు త్రీమెన్ కమిటీ అనుమతి మంజూరు చేయడం వల్లనే వచ్చామని నూతన నిర్వాహకులు చెప్పారు. ఇరు వర్గాలకు ప్రిన్సిపాల్ సర్ది చెప్పడంతో పాత సభ్యులే వంట చేశారు. కాగా.. తహసీల్దార్ గోవిందసింగ్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జి.రమాదేవి, ఎంఈఓ కోమలాదేవి తదితరులకు ఎమ్మెల్యే బి.విరూపాక్షి ఫోన్ చేసి వైఎస్సార్‌సీపీ మద్దతుదారులను మాత్రమే తొలగిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు.

## తొలగిన రహదారి ఇక్కట్లు



హొళగుంద శివారులో రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న దృశ్యం

హొళగుంద: చాలా కాలంగా పెరిగిన ముళ్ల కంపలు, గుంతలు పడిన మోకాలోతు గుంతలతో నడవలేని స్థితిని చేరిన రోడ్డుకు మండలపరిషత్ నిధులతో మరమ్మతులు చేశారు. హొళగుంద సెక్షన్‌లోని తుంగభద్ర దిగువ కాలువకు సంబంధించి 54వ డీపీ ఆయకట్టు రైతులు, ఇదే దారిలో ఉన్న అగ్రహార ఆంజనేయస్వామి ఆలయానికి భక్తులు భారీగా వెళ్తారు. అయితే ఈ రోడ్డు ముళ్లకంపలు, పిచ్చి మొక్కలు పెరిగి, గుంతలు పడి అధ్వానంగా మారింది. భక్తులు, రైతులు ఆ మార్గంలో రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడ్డారు. దీంతో వారు గ్రామ పెద్దలు పంపాపతి, దిడ్డి వెంకటేష్, ఎర్రిస్వామి, సిందువాళ కృష్ణయ్య, మల్లయ్య, కన్నయ్య, ఆలయ నిర్వాహకులు ఈశా దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన ఎంపీపీ నిధులతో దాదాపు మూడు కి.మీ మేర రోడ్డుకు గ్రావెల్ వేసి చదును చేయించారు.

### రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున్న దృశ్యం

కృష్ణగిరి: స్థానిక కస్తూర్బా విద్యాలయానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు గతనెల 29,30వ తేదీల్లో గుంటూరులో జరిగిన రాష్ట్రస్థాయి సౌత్ జోన్ జోన్ పోటీల్లో రాణించి పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ చైతన్య ప్రవంతి శనివారం తెలిపారు. రోప్ స్కిప్పింగ్‌లో అండర్ –17 విభాగంలో జ్యోతి రాణించి రెండవ స్థానంలో నిలిచిందన్నారు. అలాగే అయిషా (30 సెకండ్స్ స్పీడ్ విభాగంలో) మూడవ స్థానంలో నిలిచి ఈనెల 29,30వ తేదీల్లో గోవాలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. విద్యార్థినులు, పీఈటీ సుప్రియను అభినందించారు.

**ఎస్‌డీపీఐ నూతన కమిటీ ఎన్నిక**

హొళగుంద: సోషెల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎస్‌డీపీఐ) ఆలూరు అసెంబ్లీ నూతన కమిటీని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు హఫీజ్ అతావుల్లా అధ్యక్షతన మండల కేంద్రంలో శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్‌డీపీఐ ఆలూరు అసెంబ్లీ అధ్యక్షుడిగా అబ్దుల్ హమిద్, ఉపాధ్యక్షుడిగా అబ్దుల్ రహిమాన్, ప్రధాన కార్యదర్శిగా అబ్దుల్‌సుభాన్, కార్యదర్శిగా హఫీజ్, సలాం, కోశాధికారిగా అల్లాబకాష్, మెంబర్లుగా షఫి, అస్లాం, రహంతుల్లా, బాషా తదితరులను ఎన్నుకున్నారు.